


పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
7లో..
తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి

రుణమాఫీపై దరఖాస్తుల వెల్లువ



- మూడు విడతల్లోనూ మాఫీ కాకపోవడంతో ఆందోళన
- రేషన్ కార్డు లేనివారివి పెండింగ్‌లోనే..
- రూ.2 లక్షల పైగా అప్పున్న రైతుల్లో ఉత్కంఠ
- అధికారులు, బ్యాంకుల చుట్టూ రైతన్నల ప్రదక్షిణలు

నెన్నెల, ఆగస్టు 23: రుణమాఫీ కానీ రైతులు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. అన్ని అర్హతలుండి రుణమాఫీ కాకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. మూడు విడతల్లో రుణం ఎందుకు మాఫీ కాలేదో తెలియక ఆవేదన చెందుతున్నారు. సాగు పనులు వదులుకొని బ్యాంకులు, వ్యవసాయశాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్‌లో అర్జీలు పెట్టుకుంటున్నారు. రుణమాఫీ కాని రైతులు వేల సంఖ్యలో ఉండడంతో దరఖాస్తులు కుప్పలుతెప్పలుగా వస్తున్నాయి.

పలు కారణాలతో పెండింగ్

చిన్నచిన్న పొరపాట్లతో చాలా మంది రైతులు పంట రుణమాఫీకి దూరమయ్యారు. కొందరికి సాంకేతిక సమస్యలతో మాఫీ కాలేదు. ఆహార భద్రత కార్డు ఉండి రూ2 లక్షల లోపు రుణం ఉన్న రైతుల్లో సైతం మాఫీ కానివారున్నారు. కుటుంబంలో ఒక్కరే రుణం తీసుకున్నా.. ధరణి రికార్డు ప్రకారం పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డుతో బ్యాంకు లింకేజీ, ఈ కేవైసీ అప్‌డేట్ ఉండి కూడా రుణం మాఫీ కాలేదని వాపోతున్నారు. కుటుంబ సభ్యుల పేరిట రూ. రెండు లక్షల పైన రుణం ఉన్న వారికి కూడా పథకం వర్తించకపోవడంతో అయోమయంలో ఉన్నారు. రేషన్ కార్డుతో సంబంధం లేదని చెబుతూనే కార్డు లేని వారికి రుణమాఫీ పథకాన్ని వర్తింపజేయలేదు. కుటుంబ సభ్యుల నిర్ధారణ కోసం ఇంటింటికి వచ్చి వివరాలు సేకరిస్తారని అధికారులు చెబుతున్నారు. నిర్ధారణ చేసేది ఎప్పుడో మాఫీ అయ్యేది ఎప్పుడో తెలియడం లేదని రైతులంటున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ పథకం లబ్ధిదారులందరూ రుణమాఫీకి అర్హులవు తారు. కాని పీఎం కిసాన్ వస్తున్న రైతుల్లో చాలా మందికి రుణమాఫీ కాలేదు. పోర్టల్‌లో ఎడిట్ ఆప్షన్ లేకపోవడంతో అధికారులకు ఇబ్బందులు తలెత్తు తున్నాయి. ఆధార్‌కార్డు నంబరు సరి చేసే ఆప్షన్ కూడా లేదని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొన్నారు. అర్జీలను తీసుకోవడం వరకే తమ బాధ్యతగా చెబుతున్నారు.

రైతుల ఆందోళన బాట

పంట రుణం మాఫీ కాకపోవడంతో రైతులు రోడ్డెక్కుతున్నారు. ధర్నాలు, ఆందోళనలు చేస్తున్నారు. వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకులకు వెళ్లి అధికారులను నిలదీస్తున్నారు. రెండు రోజుల కిందట నెన్నెల మండల కేంద్రంలో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. రుణం తీరలేదని మనస్తాపంతో ఆత్మహత్యయత్నాలకు పాల్పడుతున్నారు.

మూడు విడతల్లో రుణమాఫీ ఇలా..

ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించిన మూడు విడతల్లో జిల్లాలోని 53,442 మంది రైతులకు రుణమాఫీ కింద రూ.465 కోట్ల 17 లక్షల 59 వేల 201లు వివిధ బ్యాంకుల్లో జమ అయ్యాయి. మొదటి విడతలో లక్ష రూపాయల లోపు రుణాలున్న 28,749 మంది రైతులకు రూ.151 కోట్ల 27 లక్షల 19 వేల 035లు మాఫీ అయ్యాయి. రెండో విడతలో రూ.లక్షన్నర జాబితాలో 14,104 మంది రైతులకు రూ. 175కోట్ల 43 లక్షల 83 వేల912లు మాఫీ అయ్యాయి. మూడో విడతలో రెండు లక్షల లోపు రుణం ఉన్న 10,611 మంది రైతులకు రూ.175 కోట్ల 43 లక్షల 83 వేల 912లు ఖాతాల్లో జమ అయ్యాయి.

కేసీసీ బ్యాలెన్స్‌తో నష్టపోయిన రైతులు

గత ప్రభుత్వం రుణమాఫీ చేసి ఖాతాలో జమ చేసిన డబ్బులను డ్రా చేసుకోకుండా బ్యాంకులోనే నిల్వ ఉన్న రైతులు నష్టపోయారు. రుణ ఖాతానే కదా కొంతలో కొంతైన అప్పు తీరినట్టు అవుతుందని అందులోనే నిల్వ ఉన్న వారికి ఆ సొమ్ము మినహాయించుకొని మిగతా జమ చేశారు. ప్రభుత్వం బ్యాంకర్ల నుంచి వివరాలు తీసుకునే సమయంలో ఔట్ స్టాండింగ్ నిల్వలు చూపడంతో రైతులకు బ్యాలెన్స్ పోనూ మిగతా డబ్బు మాత్రమే జమ అయిందని బ్యాంకర్లు అంటున్నారు. ఎప్పటికప్పుడు డబ్బులు డ్రా చేసుకున్న వారు లబ్ధి పొందగా, నిల్వ ఉంచుకున్న వారు మాత్రం నష్టపోయారు.

రూ. 2 లక్షలకు పైబడి రుణం ఉంటే ఎలా...

రెండు లక్షల వరకు రుణాన్ని ప్రభుత్వం మాఫీ చేయగా, ఆ పైబడిన రైతుల పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదు. రైతు పేరిట రుణం ఎంత ఉన్నా రూ.2 లక్షలకు మాఫీ చేస్తారని రైతులు భావించారు. కాని రూ.2 లక్షల రుణం తీసుకున్న రైతులు వడ్డీతో పాటు ఆపై ఉన్న డబ్బులను బ్యాంకులో చెల్లిస్తే రూ.2 లక్షలు రైతుల ఖాతాల్లో జమ చేస్తారని అధి కారులంటున్నారు. ఈ నిబంధనపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రుణం ఎంత ఉన్నా రూ.2 లక్షలు మాఫీ చేస్తే ఎలాంటి సమస్య ఉండదని రైతులు అభిప్రాయ పడుతున్నారు.



నా పేరు చంద్రగిరి కమల. నెన్నెల శివారులో 4 ఎకరాల భూమి ఉంది. పెట్టుబడి కోసం నెన్నెల గ్రామీణ బ్యాంకులో రూ.1.60 లక్షల పంట రుణం తీసుకున్న. వడ్డీతో కలుపుకొని రూ.1,63,158 బ్యాంకులో కట్టాల్సి ఉంది. ప్రభుత్వం రుణమాఫీ అమలు చేస్తుండటంతో రుణ విముక్తి అవుతుందని ఆశపడ్డాను. మూడో విడత జాబితాలో పేరు లేకపోవడంతో బ్యాంకులో అడిగితే జమ కాలేదని చెప్పారు. అధికారులు పోర్టల్ చెక్ చేయగా కుటుంబ సభ్యుల నిర్ధారణ చేయాల్సి ఉందనే స్టేటస్ వస్తోంది. దీంతో రుణమాఫీ అవుతుందో లేదో అనే అయోమయంలో ఉంది.

కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా..
కొండపర్తి ఆశాలు, నెన్నెల



రుణమాఫీ కాకపోవడంతో నెల రోజులుగా బ్యాంకు, ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా. నా పేరిట రూ.80 వేల రుణం ఉంది. మొదటి విడతలోనే మాఫీ కావాల్సి ఉం డగా జాబితాలో పేరు రాలేదు. ఆధార్ నం బరు తప్పుగా నమోదు అయిందని బ్యాంకులో చెప్పారు. జిరాక్సులతో ఏఈవో కు అర్జీ పెట్టుకోవాలని సూచించారు. అధికారులు చేసిన తప్పిదానికి నేను బలి కావాల్సి వస్తోంది. వెంటనే సరిదిద్ది మాఫీ చేయాలి.

గ్రాస్ ప్లాంట్లను పరిశీలించిన ఎఫ్‌డీపీటీ



గ్రాస్‌ప్లాంట్లను పరిశీలిస్తున్న ఎఫ్‌డీపీటీ శాంతారామ్

జన్నారం, ఆగస్టు 23 : కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని ఇందన్‌పల్లి రేంజ్‌లోని అడవిలో గ్రాస్ ప్లాంట్లను ఎఫ్‌డీపీటీ శాంతారామ్ శుక్రవారం పరిశీలించారు. అటవీ అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రాస్ ప్లాంట్లు విరివిగా పెంచితేనే శాకాహార జంతువులు పెరుగుతాయని వాటి కోసం పులి వస్తుందని సూచించారు. అడవి ప్రాంతంలో వెదురు బొంగుల నరికివేత లేకుండా చూడాలని సూచించారు. డీఎఫ్‌వో శివ్‌ఆశిష్‌సింగ్, ఎఫ్‌ఆర్‌వో హాఫీజుద్దీన్, ఎఫ్‌ఎస్‌వో రవి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 23: ఏసీసీ ఏరియాలో గల 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ పునరుద్ధరణ చేస్తున్నందున శనివారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కల్గుతుందని ఏడీఈ వేణుగోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్కెట్ ఏరియా, జన్మభూమినగర్, జాఫర్‌నగర్, గౌతమీనగర్, ఇందిరానగర్, ఇస్లాంపురా, హైటెక్‌సిటీ, సుభాష్‌రోడ్, ఎంసీసీ ఏరియా, అండాలమ్మ కాలనీ, గ్రీన్ సిటీ, లక్ష్మీనగర్, వికాస్‌నగర్, మారుతినగర్, రాళ్లపేట ప్రాంతాలకు అంతరాయం కల్గుతుందని తెలిపారు.

బెల్లంపల్లి: ఆకెనపల్లి, పెర్కపల్లి ఫీడర్‌లలో మరమ్మతు కారణంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ రామ్‌మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమగూడెం, పాత బెల్లంపల్లి, ఆకెనపల్లి, బుచ్చయ్యపల్లి, లింగాపూర్, లంబాడీతండా, బట్వాన్‌పల్లి, పెర్కపల్లి, దుగ్నేపల్లి గ్రామాల్లో విద్యుత్ అం తరాయం ఉంటుందని ప్రజలందరు సహకరించాలని కోరారు.

జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

ఏసీసీ, ఆగస్టు 23: యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ అద్వ ర్యంలో జిల్లా స్థాయి ఎంపిక పోటీలను ఈ నెల 25న నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తిరుపతి వర్మ, శ్రీనివాస్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని సెవెన్ హిల్స్ హైస్కూల్‌లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 9849669448లో సంప్రదించాలన్నారు.

పీఎం జన్మన్ యోజన కార్యక్రమం

జన్నారం, ఆగస్టు 23: కొత్తపేట గ్రామంలో ట్రైబల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ అధ్వర్యంలో పీవీటీజీల కోసం పీఎం జన్మన్ యోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆధార్ కార్డు అప్‌డేషన్, కులం, నివాసం సర్టిఫికెట్‌లు అప్లై, జన్‌ధన్ ఖాతా కిసాన్ క్రెడిట్ కార్డు ఓపెన్ చేయడం లాంటి కార్యక్రమాలను నిర్వహించినట్లు తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఎంపీడీవో శశికళలు తెలిపారు. కార్యక్రమంలో ట్రైబల్ డిపార్టుమెంట్ అధికారులు పాల్గొన్నారు.

కస్తూర్బా విద్యాలయంలో కమిషనర్ పరిశీలన

నస్పూర్, ఆగస్టు 23: సీసీసీలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్ వంటశాల, భోజనం, నిత్యావసర సరకులను పరిశీలించారు. విద్యార్థులకు పరిశుభ్రతతో కూడిన వాతావరణంలో వంటలు చేయాలని సూచించారు. తాజాగా లభించే కూరగాయలు వినియోగించాలన్నారు. ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. డెంగ్యూ, మలేరియా వ్యాధులు ప్రబల కుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కాగా డ్రైడే ఫ్రైడే సందర్భంగా వార్డుల్లో పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహిం చారు. 7, 15, 20 వార్డుల్లో వ్యాధుల నియంత్రణకు దోమల నివారణకు స్ప్రై చేసి, పరిసరాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, వైస్ చైర్మన్ గెల్లి రజిత, మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్ కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



కస్తూర్బాలో సరుకులను పరిశీలిస్తున్న కమిషనర్

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



నందులపల్లిలో మాట్లాడుతున్న కలెక్టర్

నెన్నెల, ఆగస్టు 23: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. పరిశుభ్రత తోనే వ్యాధుల వ్యాప్తిని నియంత్రించవచ్చన్నారు. నందులపల్లిలో శుక్రవారం పర్యటించారు. వీధుల్లో చెత్తాచెదారం, నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. దోమల నివారణకు రోజు ఫాగింగ్ చేయాలన్నారు. ఫాగింగ్ యంత్రాలు లేకపోతే కొనుగోలు చేయాలని లేదా చుట్టుపక్క పంచా యతీలతో సమన్వయం చేసుకోవాలన్నారు. నర్సరీని సందర్శించి వెదురు మొక్కల పెంపకంపై గిరిజన రైతులకు అవగాహన కల్పిం చాలని సూచించారు. కుశ్నపల్లిలో ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి మధ్యాహ్న భోజనం పరిశీలించారు. తరగతి గదిలో చేపట్టిన మరమ్మతును పరిశీలించారు. అదనపు గదులకు పేయింటింగ్ చేయించాలని ఆదేశించారు. చిత్తాపూర్‌లో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. అదనపు గదుల నిర్మాణ పనులను అర్ధాంతరంగా నిలిపివేయడంపై ఇంజనీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 15 రోజుల్లో పనులు పూర్తి చేయాలని, లేకపోతే కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులు పరిశీలించి అభివృద్ధి పనులపై తెలుసుకున్నారు. కార్యాలయం ఎదుట అధికారులతో కలిసి మొక్కలు నాటారు. పీహెచ్‌సీ సందర్శించి సిబ్బంది 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. తహసీల్దార్ రమేష్, ఏపీవో నరేష్ తదితరులు ఉన్నారు.

బాగా చదువుతున్నారు.. వెరీ గుడ్..



పిల్లలు ఇంగ్లీష్ బాగా చదువుతున్నారు.. తెలుగులో అర్థాన్ని కూడా చెబుతున్నారు. వెరీ గుడ్.. అంటూ కలెక్టర్ కుశ్నపల్లి ప్రాథమిక పాఠశాల పిల్లలను మెచ్చుకున్నారు. కొంత సేపు పిల్లలతో గడిపారు. మూడో తరగతి పిల్లలు ఇంగ్లీష్ చదవడం.. తెలుగులో అర్థం చెప్పడం.. పుస్తకంలో ఏ పేజీలోని పాఠం అడిగినా చెబుతుండటంతో ఆసక్తిగా విన్నారు. ఐదో తరగతి పిల్లలు చదవడంలో తడబడతారు.. ఇక్కడి మూడో తరగతి పిల్లలే మంచిగా చదువుతున్నారన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్

హాజీపూర్, ఆగస్టు 23: గురుకుల విద్యాలయం విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. శుక్రవారం ముల్కల్ల సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాన్ని తనిఖీచేశారు. వంటగది, మరుగుదొడ్లు, మూత్రశాలలను పరిశీలించారు. హాస్టల్‌లో వసతుల గురించి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రిన్సిపాల్ మోహన్, ఉన్నారు.

ప్రణాళికతో చదివితే విజయం వరిస్తుంది



మాట్లాడుతున్న ప్రసన్న హరికృష్ణ

ఏసీసీ, ఆగస్టు 23 : పోటీ పరీక్షల అభ్యర్థులు ప్రణాళికతో చదివితే విజయం వరిస్తుందని పోటీ పరీక్షల విశ్లేషకుడు ప్రొఫెసర్ ప్రసన్నహరికృష్ణ అన్నారు. శుక్రవారం జిల్లా గ్రంథాలయంలో పోటీ పరీక్షల అభ్యర్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. అంకితభావంతో కష్టపడి చదివితే ఉద్యోగం సాధించడం సులువేనన్నారు. సిలబస్‌ను చదవడం ఎంత ముఖ్యమో ప్రాక్టీస్ చేయడం కూడా అంతే ముఖ్యమన్నారు. విద్యార్థులకు పోటీ పరీక్షల మెటీరియల్‌ను పంపిణీ చేశారు. లైబ్రరీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీ నెల ఉత్తమ పురస్కారాలు

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 23 : టీజీఎస్‌పీడీసీఎల్‌లో విధులు నిర్వహించే ఉద్యోగుల్లో స్నేహపూర్వకమైన తత్వాన్ని పెంచేలా వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ప్రతీ నెల ఉత్తమ పురస్కారాల కింద జ్ఞాపికలను అందజేయనున్నట్లు మంచిర్యాల సర్కిల్ సూపరింటెండెంట్ ఎస్.శ్రావన్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ప్రతీ నెల ఉత్తమ ఉద్యోగులకు, సిబ్బందికి అవార్డులను ప్రకటిస్తారని, ఈ విధానంతో ఉద్యోగులు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు.

విద్యుత్ ఏఈగా శంకర్

భీమారం, ఆగస్టు 23 : భీమారం మండల ఏఈగా శంకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఏడీఈ రవికుమార్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. గతంలో పని చేసిన ఏఈ కుమారస్వామి రిటైర్‌మెంట్ కాగా ఏఈగా శంకర్‌ను నియమించారు.

అంతరిక్ష పరిశోధనలపై అవగాహన పెంచుకోవాలి



ఇస్రో శాటిలైట్ స్టేషన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న విద్యాశాఖ ఆర్‌జేడీ

ఏసీసీ, ఆగస్టు 23: అంతరిక్ష పరిశోధనలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని విద్యాశాఖ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా సైన్స్ కేంద్రంలో నిర్వహించిన జాతీయ అంతరిక్ష దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. చంద్రయాన్ 3 ప్రయోగం ద్వారా గతేడాది చంద్రునిపై ల్యాండర్‌ను దింపి జాబిల్లిని అందుకున్న ఘనత సాధించామన్నారు. ప్రపంచ దేశాల్లో భారత దేశానికి చంద్రయాన్ ప్రయోగం అత్యుత్తమ స్థానాన్ని కట్టబెట్టిందన్నారు. యేటా ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అన్ని పాఠశాలల్లో అంతరిక్ష దినోత్సవం వేడుకలు నిర్వహించామన్నారు. అనంతరం జిల్లా సైన్స్ కేంద్రం, జిజ్ఞాన సంచార ప్రయోగశాలలను సందర్శించి పని తీరును తెలుసుకు న్నారు. డీఈవో యాదయ్య, సైన్స్ అధికారి మధుబాబు, ఎంఈవో జాడి పోచయ్య, సెక్టోరల్ అధికారి చౌదరి, కుమారస్వామి పాల్గొన్నారు.

కాసిపేట: తెలంగాణ మోడల్ స్కూల్‌లో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు ప్రతిభ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ అందె నాగమల్లయ్య మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ ఆవిష్కరణలపై నైపుణ్యం పెంచుకుని ఆవిష్కరణలు చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నస్పూర్: సీతారాంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహించారు. అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థులకు వ్యాస రచన, పోస్టర్ మేకింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం చంద్రయాన్ మాడ్యూల్ పైన రూపొందించిన 30 నిమిషాల వీడియోను ఆన్ లైన్ ద్వారా ప్రదర్శించగా విద్యార్థులు వీక్షించారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు

కవ్వాల్ టైగర్ జోన్‌కు పులి వచ్చింది...
-జన్నారం డివిజన్‌లో కనిపించిన పులి

జన్నారం, ఆగస్టు 23: కవ్వాల టైగర్ జోన్‌లో పులి అగుపించింది. టైగర్ జోన్ 2012లో ఏర్పడిన తర్వాత మల్యాల అటవీ ప్రాంతంలో పులి అడుగులు అగుపించాయి. అనంతరం ఈ ప్రాంతంలో పులి జాడ కనపడలేదు. రెండు రోజుల నుంచి కవ్వాల టైగర్ జోన్‌లోని జన్నారం రేంజ్‌లోని గోండుగూడ, ఫైడిపెల్లి అటవీ ప్రాంతంలో పులి కనిపించడంతో అటవీ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. శుక్రవారం గోండుగూడ అటవీ ప్రాంతం పశువుపై దాడి చేయడంతో స్వల్ప గాయాలయ్యాయి. దీంతో కాపరులు పరుగులు పెట్టినట్లు తెలిసింది. గోండుగూడ అటవీ ప్రాంతంలోని జన్నారం, గోండుగూడ బీట్‌తోపాటు పలు ప్రాంతాల్లో పులి తిరుగుతున్నట్లు స్థానికులతోపాటు అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ విషయంపై ఎఫ్‌ఆర్‌వో సుష్మారావును ఆంధ్రజ్యోతి సంప్రదించగా పులి వచ్చింది వాస్తవమేనని, స్థానికులతోపాటు అటవీ శాఖ అధికారులు సైతం చూసినట్లు తెలిపారు. ఈ విషయం వెల్లడించేందుకు మాకు ఎలాంటి ఆదేశాలు లేవని చెప్పారు. పులి ఈ సారైనా టైగర్‌జోన్‌లో స్థిరనివాసం ఏర్పాటు చేసుకుంటుందో లేదో వేచి చూడాలి.

సామాజిక తనిఖీ ప్రజావేదిక



సామాజిక తనిఖీ ప్రజావేదికలో డీఆర్‌డీవో కిషన్, ప్రత్యేకాధికారి

వేమనపల్లి, ఆగస్టు 23: వేమనపల్లి ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ అధ్యక్షతన 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. డీఆర్‌డీవో కిషన్ హాజరయ్యారు. 14 గ్రామపంచాయతీల నివేదికలు డీఆర్‌పీలు చదివి వినిపించారు. మస్టర్‌లలో కొట్టివేతలు, కూలీల సంతకాలు సరిగా లేవని, హరితహారం రిజిష్టర్‌లు, ఎంబీ నిర్వహణలో వర్క్‌ఫైల్‌లు లేవని, మొక్కల మధ్య తేడాలు ఉన్నట్లు గుర్తించిన డీఆర్‌డీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన కార్యదర్శులు, సాంకేతిక క్షేత్ర సహాయకులకు జరిమానాలు విధించారు. ఇలాంటివి మళ్లీ పునరావృతం అయితే చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఎంపీడీవో దేవేందర‌రెడ్డి, విజిలెన్స్ అధికారి కిరణ్, సురేష్, కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

విధులను సమర్థవంతంగా నిర్వహించాలి



కలెక్టర్‌కు పూల మొక్క అందిస్తున్న జిల్లా పౌరసరఫరాల మేనేజర్

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 23: పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో అధికా రుల సమన్వయంతో విధు లను సమర్థవంతంగా నిర్వ హించాలని కలెక్టర్ కుమా ర్‌దీపక్ అన్నారు. పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీకళ శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. శ్రీకళ నిర్మల్ జిల్లా నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

అంబేద్కర్ ఓపెన్ డిగ్రీకి దరఖాస్తుల ఆహ్వానం

బెల్లంపల్లి, ఆగస్టు 23: బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రంలో డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఇంటర్మీడియట్ లేదా తత్సమాన అర్హతలు కలిగిన వారు ఈ నెల 31లోగా దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్, కో ఆర్డినేటర్ ఏకాంబరం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో అడ్మిషన్‌లు ఉన్నాయన్నారు. వివరాలకు 9640279766, 9346791768, 9502262490లో సంప్రదించాలన్నారు.

ఓటరు జాబితా పరిశీలన

కాసిపేట, ఆగస్టు 23: కాసిపేట పంచాయతీలో శుక్రవారం ఎంపీడీవో సత్తార్ అలీ ఓటరు మెర్జింగ్ జాబితాను పరిశీలించారు. పంచాయతీ ఎన్నికల్లో భాగంగా వార్డుల వారీగా ఓటర్ల జాబితాను మెర్జింగ్ చేస్తున్నామన్నారు. టీపోల్ వెబ్‌సైట్‌లో ఓటర్ల జాబితాను నమోదు చేస్తున్నామన్నారు. లక్ష్మీనారాయణ, కంప్యూటర్‌ఆపరేటర్లు పాల్గొన్నారు.

సభ పోస్టర్ల విడుదల

బెల్లంపల్లి, ఆగస్టు 23 : హైద్రాబాద్‌లోని వీఎస్‌టీ ఫంక్షన్‌హాలులో ఈ నెల 31, సెప్టెంబరు 1, 2 తేదీల్లో జరిగే ప్రగతి శీల మహిళ సంఘం రాష్ట్ర 7వ మహాసభ పోస్టర్లను శుక్రవారం పట్టణంలో సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జ్యోతి విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ సభలకు మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కృష్ణవేణి, ఈశ్వరి, పద్మ, లక్ష్మీ, సునీత, చంద్రకళ, రాజేశ్వరి, చిన్నక్క పాల్గొన్నారు.

మహిళ కార్మికురాలిపై దాడి హేయమైన చర్య

బెల్లంపల్లి, ఆగస్టు 23: గోదావరిఖనిలో సింగరేణి కార్మికురాలైన మహిళపై ఏఐటీయూసీ నాయకులు ఎల్లయ్య అతని అనుచరులు దాడి చేయడం హేయమైన చర్య అని హెచ్ఎంఎస్ నాయకుడు మహమ్మద్‌గౌస్ ఒక ప్రకటనలో తెలిపారు. దళిత మహిళ కార్మికురాలు అని చూడకుండా దాడి చేయడం సిగ్గు చేటన్నారు. అధికార అహంకారంతో ఏఐటీయూసీ నాయకులు ప్రవర్తిస్తున్నారని ఇది సరైంది కాదన్నారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

వైద్య శిబిరం

కోటపల్లి, ఆగస్టు 23: శెట్‌పల్లి గ్రామంలో శుక్రవారం వైద్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. హెల్త్ అసిస్టెంట్ సుధాకర్‌గౌడ్ పరిసరాల పరిశుభ్రత, జ్వరాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. నిల్వ నీటిని పరిసరాల్లో ఉంచరాదని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆశా కార్యకర్త శంకరమ్మ, గ్రామస్థులు పాల్గొన్నారు.

ట్రస్మా మండల కమిటీ

కెరమెరి, ఆగస్టు 23: తెలంగాణ గుర్తింపుపాఠశాలల యాజమాన్య సంఘం(ట్రస్మా) మండలకమిటీని శుక్రవారం ఆసంఘం రాష్ట్రగౌరవ అధ్యక్షుడు పెద్దపల్లి కిషన్‌రావు, జిల్లా అధ్యక్షుడు దేవభూషణం ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంపత్‌కుమార్, ప్రధానకార్యదర్శిగా అంజనేయులు, కోశాధికారిగా షేక్‌కలీంను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తిరుపతి దారి, రాజేందర్ ప్రసాద్, సంజీవ్, జ్యోతేష్ సితానీ, తిరుపతి, తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

అతివేగంతో ప్రమాదాలు: ఎస్సై

సిర్పూర్(యు), ఆగస్టు 23: వాహనాలు అతివేగంతో నడిపిస్తే ప్రమాదాలు జరుగుతాయని ఎస్సై రామకృష్ణారావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనాచోదకులు అతివేగంగా నడుపరాదన్నారు. వాహనధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. మండలకేంద్రంలోగల కేజీబీవీపాఠశాల విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించారు.

ప్రైవేటు పాఠశాలల సమస్యలను పరిష్కరిస్తాం

మందమర్రి టౌన్, ఆగస్టు 23: జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తానని ట్రస్మా జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ తెలిపారు. శుక్రవారం మందమర్రిలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులతో త్వరలో సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా పాఠశాలల సంఖ్యతో పాటు నిర్వాహకులు, ఉపాధ్యాయుల సంఖ్యను సేకరిస్తున్నామని, దీనికి సంబంధించి భవిష్యత్‌లో సంక్షేమ నిధిపై కూడా దృష్టి సారించామని తెలిపారు. విద్యా వ్యాప్తికి కృషి చేస్తున్న ప్రైవేటు పాఠశాలలకు ప్రభుత్వ సహకారం ఉండాలన్నారు.

మందమర్రి మండల ట్రస్మా కమిటీ

మందమర్రి మండల ట్రస్మా ఉపాధ్యాయ సంఘాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గ్రేస్ లిటిల్ హార్ట్స్ శ్యాంకుమార్, ప్రధాన కార్యదర్శిగా లతశ్రీ, కోశాధికారిగా సారంగరావు, మండల గౌరవ అధ్యక్షుడిగా సమ్మిరెడ్డిలను ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంజేంద్రపాణి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రామకృష్ణ, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, జిల్లా గౌరవ అధ్యక్షుడు దేవన్నలు పాల్గొన్నారు.

సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నేతకాని సంఘం నాయకులు

కాసిపేట, ఆగస్టు 23: పొలాల అమావాస్య పండుగ సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించేలా నిర్వహించాలని నేతకాని మహర్ కుల సంఘం రాష్ట్ర నాయకుడు దాగం మల్లేష్ అన్నారు. శుక్రవారం సోమగూడెంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేతకాని మహర్ కులస్థుల్లో అత్యంత పవిత్రంగా జరుపుకునే పండగల్లో పొలాల అమావాస్య ఒకటని తెలిపారు. ఈ పండగను అమావాస్య రోజునే జరుపుకోవాలి కానీ సెప్టెంబరు 2, 3 తేదీల్లో అమావాస్య కలిసి వస్తుందని, దీన్ని ఏ రోజు జరుపుకోవాలని నిర్ణయించడం కోసం ఈ నెల 25న బెల్లంపల్లి ఎస్సీ కమ్యూనిటీ హాలులో సమావేశం నిర్వహిస్తామన్నారు. నేతకాని కులబాంధవులు సకాలంలో హాజరు కావాలని కోరారు. గోమాస భీమయ్య, రాజలింగు, బోర్లకుంట మధునయ్య, సుధాకర్, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

దండేపల్లి,ఆగస్టు 23: రాజుగూడ గ్రామ పంచాయతీ పరిధి తత్రగూడ చెందిన ఆత్రం లచ్చు, జైతుగూడ గ్రామానికి చెందిన తత్ర అందూర్ (భీమయ్య)అనే గిరిజనుడు శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. మాజీ వైస్ ఎంపీపీ ఆకుల రాజేందర్ వారి కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందించారు. మర్సుకోల లచ్చుపటేల్, పుట్టపాక తిరుపతి, బట్టు రాజయ్య, దయాకర్, రాజశేఖర్, మల్లేష్, పాల్గొన్నారు.

తత్ర భీమయ్య అనే కాంగ్రెస్ పార్టీ కార్యకర్త శుక్రవారం మృతి చెందాడు. కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కంది సతీష్‌కుమార్ రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కనక జంగు, నిహాల్‌ఖాన్, కాంతరావు, లింగారావు, సాదిక్, జావెద్‌ఖాన్, చంద్రయ్య పాల్గొన్నారు.

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 4,376 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరులోకి రెండు మోటార్ల ద్వారా 6300క్యూసెక్కుల నీటినిఎత్తి పోస్తున్నారు. ఎన్టీపీసీకి, తాగునీటి అవసరాల కోసం 419 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 15.302 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి

చెన్నూరు, ఆగస్టు 23: మండలంలోని సుబ్బరాంపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి ముక్కెర సత్యనారాయణగౌడ్ (38) అనే గీత కార్మికుడు మృతిచెందాడు. బావురావుపేట పంచాయతీ పరిధిలోని గుండాయిపల్లె గ్రామానికి చెందిన రాజుబాయి మధునయ్యలకు ముగ్గురు కుమారులు. చిన్న కుమారుడు సత్యనారాయణగౌడ్ సుబ్బరాంపల్లి గ్రామంలో కొన్నేండ్లుగా కల్లు తీస్తున్నాడు. శుక్రవారం కల్లు తీసేందుకు తాటి చెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి కింద పడి మృతిచెందాడు. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ శ్వేత పరిశీలించారు. మృతుడికి భార్య కనకలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైతులకు అవగాహన



పత్తి చేనులో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో ప్రభాకర్

కాసిపేట, ఆగస్టు 23 : పత్తి సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటించకుంటే పంట దిగుబడి తగ్గుతుందని, వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ పంటల దిగుబడిని పెంచుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రభాకర్ సూచించారు. శుక్రవారం కనికలాపూర్‌లో పత్తిపంట పట్ల రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం పత్తి పంట సాకి ఉత్పత్తి దశ నుంచి మొగ్గ దశలో ఉంటుందని, పత్తిపంటలో రసం పీల్చేపురుగులతోపాటు పచ్చదోమ, తెల్లదోమ ఉధృతంగా వ్యాపిస్తుందన్నారు. నివారణకు ఎస్సెట్ 300 గ్రాములు, ఇమిడాక్లోప్రిడ్ 80 మిల్లీ మీటర్లులేదా ఫ్లానికామైడ్ ఒక ఎకరానికి 75 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. రైతులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి(తాండూర్): తాండూర్ మండలంలోని కొత్తపల్లి రైతు వేదికలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గిరిజన ఉప ప్రణాళిక కింద రైతులకు సమగ్ర పంట యాజమాన్య పద్ధతులతో వంకాయ సాగు విధానంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రైతులకు శాస్త్రీయ సలహాలను వివరించారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ స్రవంతి, మండల వ్యవసాయాధికారి ప్రేంకుమార్, ఏఈవోలు శంకర్‌కుమారి, పుష్పలత రైతులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: చిర్రకుంట గ్రామంలో రైతులకు పంటలపై ఏఈవో ముత్యం తిరుపతి అవగాహన కల్పించారు. వరిలో కాలిబాటలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా దిగుబడి వస్తుందన్నారు. వానాకాలంలో సుడిదోమ వరి పంటను ఆశిస్తుందని, నివారణకు మడిలో ప్రతీ రెండు మీటర్లకు 20 నుంచి 25 సెంటీమీటర్లతో కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీంతో పంటకు గాలి, వెలుతురు, సూర్యరశ్మి తగిలి పంట ఎదుగుతుందన్నారు. రైతులు శ్రీనివాస్, రాంచందర్, శ్రీనివాస్, యాదగిరి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ కార్యదర్శిపై ఫిర్యాదు

వేమనపల్లి, ఆగస్టు 23: కొన్ని రోజులుగా మోహన్ అనే వ్యక్తి కేవీపీఎస్ కుల సంఘం కార్యదర్శిగా చెప్పుకుంటూ డొనేషన్ల కోసం వేధిస్తున్నాడని రాజారం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు సరిత పేర్కొన్నారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మోహన్ గురువారం పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయులు లేని సమయంలో సమాచారం ఇవ్వకుండా ఫొటోలు, వీడియోలు తీసి డబ్బుల కోసం తమను వేధిస్తున్నాడని ఆరోపించారు. డబ్బులు ఇవ్వడం లేదనే ఉద్దేశ్యంతోనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని, ఇతనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని నీల్వాయి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

పూలాజీబాబా జయంతి ఉత్సవాల వాల్‌పోస్టర్లు విడుదల



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క తదితరులు

జైనూర్, ఆగస్టు 23: మండలంలోని పట్నాపూర్‌లో ఈనెల30న నిర్వహించనున్న పూలాజీబాబా జయంతి ఉత్సవాల వాల్‌పోస్టర్లను జిల్లా ఇన్‌చార్జీ, గిరిజన సంక్షేమశాఖ మంత్రిసీతక్క, సిద్దేశ్వర్ సంస్థాన్ కమిటీ సభ్యులు శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా అంద్ సమాజ్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు మగాడె విష్ణు, రాష్ట్ర అధ్యక్షుడు బుడె కైలాస్ తదితరులు మంత్రి సీతక్కను కలిసి బాబా జయంతి సందర్భంగా నిధులు విడుదల చేయాలని ఉత్సవానికి తప్పక హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్, సంస్థాన్ జిల్లాప్రధాన కార్యదర్శి దుర్గె సుభాష్, కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర కార్యదర్శి సత్తు మల్లేష్ పాల్గొన్నారు.

చిన్నారుల్లో చదివే అలవాటును పెంచాలి



మాట్లాడుతున్న నోడల్ అధికారి వెంకటేశ్వర్లు

రెబ్బెన, ఆగస్టు 23: చిన్నారుల్లో చదివే అలవాటును పెంచాలని రెబ్బెన మండల నోడల్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం రెబ్బెనలో పలు పాఠశాలను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పుస్తకాలు చదవటం ద్వారా ప్రపంచాన్ని పరిచయం చేయవచ్చని తెలిపారు. అలాగే రీడింగ్ క్యాంపెన్‌లో కథద్వారా వివరించాలన్నారు. ఆయనవెంట ప్రధానోపాధ్యాయుడు సదానందం, ఉపాధ్యాయులు ప్రవీణ్ మోతె రావ తదితరులున్నారు.

పట్టు వీడితే.. ప్రమాదమే



బస్సులో పుట్ బోర్డు వద్ద వేలాడుతూ ప్రయాణికులు

పెంచికలపేట, ఆగస్టు 23: ఆర్టీసీబస్సుల్లో ప్రజలు ప్రమాదకరంగా ప్రయాణంచేస్తున్నారు. పెంచికలపేట-కాగజ్‌నగర్ ఆర్టీసీ బస్సులో శుక్రరం యువకులు పుట్‌బోర్డుపై నిల్చుని ప్రమాదకరంగా ప్రయాణించారు. ఈ మార్గంలో ప్రయాణించే విద్యార్థులు సైతం తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మహిళలకు ఉచితబస్సు పథకం కారణంగా వారు సొంత వాహనాలు, ఆటోలు వదిలి బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. దీంతో బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. ఆర్టీసీ స్పందించి తగినన్ని బస్సులు నడపాలని ప్రజలు కోరుతున్నారు.

'సమస్యలు పరిష్కరించాలి'

జైనూర్, ఆగస్టు 23: సంజీవ్‌నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఆదివాసీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కనక యాదవ్‌రావ్‌తో కలిసి కాలనీవాసులు శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీలో కనీసం విద్యుత్‌దీపాలు లేవన్నారు. రోడ్డు సదుపాయం సక్రమంగా లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు కుంర భగ్వంత్‌రావ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



బెల్లంపల్లిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్, హాజీపూర్‌లో బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్న ఎంపీడీవో

బెల్లంపల్లి, ఆగస్టు 23: ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కమిషనర్ శ్రీనివాసరావులు పేర్కొన్నారు. శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని 28వ వార్డులో నిర్వహించారు. జ్వరాలు ప్రబలకుండా పాత టైర్లు, కుండీల్లో నిల్వ ఉన్న నీటిని పారబోయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ఎక్స్‌కావేటర్‌తో తీయించారు. కౌన్సిలర్ సరితశ్రీనివాస్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ వైకుంఠం, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ సంతోష్, టీఎంసీ దుర్గయ్య, ఆర్‌పీలు, పాల్గొన్నారు.

హాజీపూర్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో మధుసూదన్ అన్నారు. ముల్కల్ల గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. పంచాయతీ సిబ్బంది చేత మురుగుకాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. రోజు పారిశుధ్య పనులను చేయించాలని సూచించారు. ఏపీవో మల్లయ్య, కార్యదర్శి శ్రీనివాస్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: మండలంలోని పొన్నారం, మామిడిగట్టు గ్రామాల్లో ఎంపీడీవో రాజేశ్వర్ ఆధ్వర్యంలో శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి పూల కుండీల్లో, పాత టైర్లు, డ్రమ్ముల్లో నిల్వ ఉన్న నీటిని పంచాయతీ సిబ్బంది చేత పారబోయించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. కార్యదర్శి నంద్యారాణి పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు తొలగించాలి

కోటపల్లి, ఆగస్టు 23: నక్కలపల్లి పంచాయతీ బ్రహ్మణపల్లిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. మూడు నెలల క్రితం రోడ్డు వెడల్పులో భాగంగా ఎక్స్‌కావేటర్‌తో పనులు చేపట్టగా పైపులైన్ ధ్వంసమైందని, మరమ్మతు చేయకపోవడంతో తాగునీటికి ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. రోడ్డు కాంట్రాక్టర్‌కు చెప్పినా పట్టించుకోవడం లేదని, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించడం లేదన్నారు. పంచాయతీ కార్యదర్శికి, స్పెషల్ అధికారికి చెప్పినా ఫలితం లేకుండా పోతుందని, ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నేటి నుంచి గూడెం ఆలయ పవిత్రోత్సవాలు



కొలువైన శ్రీరామా సహిత సత్యనారాయణస్వామి

దండేపల్లి,ఆగస్టు 23: దండేపల్లి మండలం గూడెం సత్యనారాయణస్వామి ఆలయాన్ని పవిత్రోత్సవాలకు ముస్తాబు చేశారు. శనివారం నుంచి 3రోజుల పాటు కార్యక్రమాలు జరగనున్నాయి. యేటా నిర్వహిస్తున్న మాదిరిగానే దేవాలయ పవిత్రత, భక్తుల శ్రేయస్సుకు ఆలయ పవిత్రోత్సవం పూజ కార్యక్రమాలను వేదమంత్రోచ్చారణ నడుమ వేదపండితులు, ఆలయ అర్చకుల వైభవంగా నిర్వహిస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ పేర్కొన్నారు.

అంబేద్కర్ భవనాన్ని త్వరగా నిర్మించాలి



మాట్లాడుతున్న దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు

బెల్లంపల్లి, ఆగస్టు 23: బెల్లంపల్లి పట్టణంలోని అంబేద్కర్ భవనాన్ని త్వరగా నిర్మించాలని దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం అంబేద్కర్ భవనం వద్ద విలేకరుల సమావేశంలో నాయకులు కుంబాల రాజేష్, శంకర్‌లు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి రూ.3 కోట్లు, సింగరేణి మూడెకరాల స్థలం కేటాయించగా ఏండ్లు గడుస్తున్నా ఇంత వరకు నిర్మాణం పూర్తి కాలేదన్నారు. కొంత భూమిని కొన్ని కుల సంఘాల పేరు చెప్పి కబ్జా చేయడానికి ప్రయత్నించడంతో భవనం పూర్తికాలేదని తెలిపారు. కాంట్రాక్టర్ల ముసుగులో ఇసుక, కంకరను తరలిస్తూ కిరాయిలు తీసుకోవడం, భూమి అంబేద్కర్ భవనానికి కేటాయిస్తే అంబేద్కర్ భవనం స్థలంలో కిరాయిలు వసూలు చేయడం విడ్డూరంగా ఉందని తెలిపారు. ప్రస్తుత ఎమ్మెల్యే గడ్డం వినోద్ స్పందించి అంబేద్కర్ భవనానికి కోటి రూపాయల నిధులు కేటాయించి భవన నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. నాయకులు ఎలయ్య, గోపాల్, రాజనర్సు, చంద్రశేఖర్, సమ్మయ్య, రవిరాజ్, మురళీ, ప్రతాప్, కొమురయ్య, రాయ లింగు పాల్గొన్నారు.

ఘనంగా మంగళగౌరి వేడుకలు



పూజలు చేస్తున్న మహిళలు

మందమర్రిరూరల్, ఆగస్టు 23 : శ్రావణమాసం శుక్రవారం బహుళతదియ మంగళగౌరి వేడుకలను హనుమాన్ ఆలయంలో మహిళలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉపవాసాలు ఉండి గణపతికి అభిషేకాలు నిర్వహించారు. వెయ్యి కమలపూలతో విశేష పుష్పార్చన పూజలు చేశారు. సరిత, రమ్య, శ్రీదేవి, మాలతి, రజిత, కరుణ, శశికళ తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్ష, కార్యదర్శుల నియామకం

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 23: యూఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా మల్లేష్, మిట్టపల్లి తిరుపతిలు ఎన్నికయ్యారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కమిటీని ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ నెల 27, 28 తేదీల్లో యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలను సిద్దిపేటలో నిర్వహిస్తామని, విజయవంతం చేయాలని కోరారు. మాంతయ్య సాత్విక్, అంజి, సాయి, రవీందర్ పాల్గొన్నారు.

సన్మానం

బెల్లంపల్లి, ఆగస్టు 23 : రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం, లీగల్ సెల్ వైస్ చైర్మన్, న్యాయవాది కాంపెల్లి ఉదయ్‌కాంత్‌లను శుక్రవారం మేము సైతం ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ యూత్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు రంగ ప్రశాంత్ హైద్రాబాద్‌లో కలిశారు. ఎస్సీ నిరుద్యోగుల అర్థికాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని విన్నవించారు. అనంతరం సన్మానించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

నస్పూర్, ఆగస్టు 23 : మహిళలు రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై నెల్కి సుగుణాకర్ అన్నారు. రెడియంట్ హైస్కూల్‌లో అఖిల భారత విద్యార్థి బ్లాక్ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళలు, విద్యార్థుల రక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు గుడ్ టచ్-బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించాలన్నారు. మహిళల భద్రతకు పోలీస్ శాఖ నిరంతరం పని చేస్తుందన్నారు. అత్యవసర సమయంలో 100కు డయల్ చేయాలని సూచించారు. ఎంఆర్‌సీ సభ్యులు సింధు, పాఠశాల కరస్పాండెంట్ రజిని, అఖిల భారత విద్యార్థి బ్లాక్ జిల్లా కార్యదర్శి సన్నీగౌడ్, మండల విద్యా వనరుల కేంద్రం సభ్యులు, విద్యార్థులు, ఏఐఎస్బీ నాయకులు పాల్గొన్నారు.

జైపూర్: ఎలాంటి ఆపద వచ్చినా మహిళలు ఆత్మస్థైర్యంతో ఉండాలని ఎస్ఐ శ్రీధర్ పేర్కొన్నారు. జైపూర్‌లో నిర్వహించిన మండల సమాఖ్య సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో మహిళలు వేధింపులకు గురవుతున్నారని పేర్కొన్నారు. మహిళలు వేధింపులకు గురైతే డయల్ 100, షీటీంలకు సమాచారం అందించాలని సూచించారు. మహిళ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఏపీఎం రాజ్‌కుమార్, వీవోలు, సీసీలు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నివారణే లక్ష్యం

శ్రీరాంపూర్: మాదకద్రవ్యాల నివారణే లక్ష్యమని శ్రీరాంపూర్ ఎస్ఐ సంతోష్ అన్నారు. పోలీసుల ఆధ్వర్యంలో కృష్ణకాలనీలోని కేరళ మోడల్ స్కూల్‌లో డ్రగ్స్ నివారణపై డ్రాయింగ్, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై వివరించారు.

వాగులపై వంతెనలు నిర్మించేదెప్పుడో?

- ఆపద వేళల్లో సాహసం చేయాల్సిందే
- దశాబ్దం నుంచి పూర్తికాని అనార్‌పల్లి వంతెన



మధ్యలోనే నిలిచిపోయిన అనార్‌పల్లి వాగుపై వంతెన



గాయపడ్డ వ్యక్తిని మంచంపై పడుకోబెట్టి వాగుదాటిస్తున్న గ్రామస్థులు(ఫైల్)

కెరమెరి, ఆగస్టు 23: భారీ వర్షాలు కురిస్తే చాలు మండలంలోని గ్రామాల ప్రజలు అరిగోస పడాల్సిందే. మండలంలో దశాబ్దంక్రితం ప్రారంభించిన అనార్‌పల్లి వంతెన నిర్మాణ పనులు నేటికీ పూర్తికాకపోవడంతో ప్రతియేటా వర్షాకాలంలో ఆయాగ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వాగులుపొంగితే ఇక సాహసం చేయాల్సిందే. మండలంలోని అనార్‌పల్లి, లక్మాపూర్ వాగులపై వంతెనలు లేక ఆయా గ్రామాల ప్రజలు పుట్టెడు కష్టాలు పడుతున్నారు. ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు లక్మాపూర్ వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. రెండేళ్ల క్రితం లక్మాపూర్ గ్రామానికి చెందిన ఏడాదిన్నర వయస్సు గల బాలుడికి జ్వరం రావడంతో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు దాటి మండల కేంద్రానికి చేరుకుని చికిత్స అందించారు. అలాగే మూడేళ్ల క్రితం మరో వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడగా అతడిని ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించే క్రమంలో గ్రామంలోని యువకులు అతడిని మంచంపై పడుకోబెట్టి వాగు దాటించారు.

ఆ గ్రామాల ప్రజలకు వనవాసమే..

లక్మాపూర్, అనార్‌పల్లి గ్రామాల సమీపంలో వాగు అవ తలివైపు ఉన్న కరంజీవాడ, పెద్దకరంజీవాడ, జక్కాపూర్, బోరిలాల్‌గూడ, అంద్‌గూడ, శంకర్‌లొద్ది తదితర గ్రామాల ప్రజలు ప్రతినిత్యం వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తారు. అలాగే ఆదివారం జరిగే వార సంతకు వచ్చి నిత్యావసర సరుకులు కొనుగోలు చేస్తారు. వీరంతా వర్షాకాలంలో వాగులపై వంతెనలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

లోలెవల్ వంతెనలతో కష్టాలు..

మండలంలోని సాంగ్వీ, కేలి(బి) గ్రామాల మధ్య లో లెవల్ వంతెనలు ఉండడంతో వంతెన అవతలి వైపున ఉన్న కేలి(బి), కేలి(కె), పరస్‌వాడ, గౌరి, లెండిగూడ, బోలాపటార్ తోపాటు ఇందిరానగర్, ఖైరి, అగర్‌వాడ, ఇందాపూర్ తదితర గ్రామాలతోపాటు మహారాష్ట్రలోని జివితి గ్రామాల ప్రజలు వర్షాకాలంలో గంటల తరబడి వరద ఉధృతి తగ్గే వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

వరదలతో ఇబ్బందులు పడుతున్నాం..
- రవీంద్రనగర్, లక్మాపూర్



వంతెన నిర్మాణం పూర్తికాకపోవడంతో లక్మాపూర్‌తో పాటు పలుగ్రామాల ప్రజలు వర్షాకాలంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాయకులు, అధికారులు వంతెన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి.

వంతెన నిర్మించాలి..
- వినేష్, కేలి(బి)



లో లెవల్ వంతెనతో వర్షం కురిసిన ప్రతిసారి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. లో లెవల్ వంతెన స్థానంలో హై లెవల్ వంతెనలు నిర్మించాలి.

పిల్లల ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, ఆగస్టు 23: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలపై ప్రత్యేకదృష్టి సారించాలని అదనపుకలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లామహిళా, శిశుసంక్షేమ శాఖాధికారి భాస్కర్‌తోకలిసి సీడీపీవోలు, సూపర్ వైజర్లు, పిరామిల్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, ఎస్ఎస్ఎఫ్ఎస్ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకవిలువలుకలిగిన ఆహారాన్ని సకాలంలో అందించడంతోపాటు పిల్లల ఆరోగ్యస్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో టీహెచ్ఆర్, హెచ్‌సీఎం వివరాలను పోషణ్ ట్రాకర్‌యాప్‌లో నమోదు చేయాలన్నారు. అంగన్‌వాడీకేంద్రాల్లో పిల్లల ఎత్తు, బరువులను సకాలంలో నమోదుచేస్తూ పోషణలోపం ఉన్న పిల్లలను గుర్తించి వారి ఆరోగ్యంపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని తెలిపారు. అంగన్‌వాడీకేంద్రాల్లో అవసరమైన సదుపాయాల కోసం పూర్తి వివరాలతో నివేదిక రూపొందించివ్వాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పోషణ్‌అభియాన్ సమన్వయకర్త గోపాలకృష్ణ, సీడీపీవోలు, సూపర్‌వైజర్‌లు, పోషన్ అభియాన్ బ్లాక్‌సమన్వయకర్తలు పాల్గొన్నారు.

ఖాతాదారులు బీమా కలిగి ఉండాలి

పెంచికలపేట, ఆగస్టు 23: బ్యాంకు ఖాతాదారులు తప్పనిసరిగా బీమాకలిగి ఉండాలని రాస్పెల్లి టీజీబీ మేనేజర్ సాయిచరణ్ అన్నారు. మండలంలోని పోతెపల్లి గ్రామానికి చెందిన తెలిగే పెంటయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకం కింద రూ.436కట్టడంతో నామిని అయిన అతని భార్య పోచక్కకు శుక్రవారం రెండులక్షల బీమా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చంద్రమౌళి, అధికారులు ప్రవీణ్, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జీల పాలన ఇంకెన్నాళ్లు?

● మండలంలో కీలక పోస్టులన్నీ ఖాళీయే



ఎంపీడీవో కార్యాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీ

జైనూర్, ఆగస్టు 23: జైనూర్ ఏజెన్సీలో ప్రభుత్వ శాఖల్లోని కీలకపోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో ప్రజల సమస్యలు పెండింగులో ఉంటున్నాయి. ముఖ్యంగా ఎంపీడీవో పోస్టు ఖాళీగా ఉండటంతో సిర్పూర్(యు) ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ ఇక్కడ ఇన్‌చార్జీ ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వస్తున్నారు. అదేవిధంగా పంచాయత్‌రాజ్ ఏఈ చంద్రశేఖర్ ఇటీవల బదిలీకావడంతో ఆయన స్థానంలో ఇంకా ఎవరిని నియమించలేదు. మండల వ్యవసాయ అధికారి పోస్టు ఖాళీగా ఉండటంతో ప్రస్తుతం కెరమెరి ఏవో ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అదేవిధంగా మండలంలోని జంగాం, ఆశపెల్లి, పవర్‌గూడ, పోచంలొద్ది గ్రామ కార్యదర్శు బదిలీకావడంతో ఆయా గ్రామపంచాయతీల్లో ఇన్‌చార్జీల పాలన కొనసాగుతోంది. జైనూరు మేజర్ గ్రామపంచాయతీ పాలన కూడా ఇన్‌చార్జీ అధికారితోనే నడుస్తోంది. ఎంపీవో పోస్టు సైతం ఖాళీగా ఉంది. సుమారు రెండు సంవత్సరాల నుంచి మండల పశువైద్యాధికారి పోస్టుఖాళీగా ఉన్నందున పశువులకు వైద్యం అందని ద్రాక్షలా తయారైంది. ఈ విధంగా జైనూరు మండలంలో ఇన్‌చార్జీలపాలన కొనసాగుతుండటంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. సమస్యలు పెండెంగులో ఉన్నందున ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కార్యాలయానికి ఎప్పుడు వెళ్లిన అధికారుల కుర్చీలన్నీ ఖాళీగా ఉంటున్నాయని వారు పేర్కొంటున్నారు. ఇన్‌చార్జీ అధికారులు ఎప్పుడో ఒకసారివచ్చి కార్యాలయం పనులకే పరిమితమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెగ్యులర్ అధికారులు లేనందున మండలపాలన గాడి తప్పుతోందని తక్షణమే జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ అధికారులను నియమించాలని మండల వాసులు కోరుతున్నారు.

కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్‌గా శ్రద్ధ శుక్లా



శ్రద్ధ శుక్లా

ఆసిఫాబాద్, ఆగస్టు 23: కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్‌గా 2022 ఐఏఎస్‌బ్యాచ్‌కు చెందిన శ్రద్ధశుక్లాను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన 2022బ్యాచ్‌కు చెందిన ట్రైనీఐఏఎస్‌లను సబ్ కలెక్టర్లుగా పోస్టింగ్ ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు కాగజ్ నగర్ రెవెన్యూడివిజన్ సబ్‌కలెక్టర్‌గా శ్రద్ధ శుక్లాను నియమించింది.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి రమేష్

ఆసిఫాబాద్ రూరల్,ఆగస్టు 23: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలునాటాలని జిల్లాప్రధాన న్యాయాధికారి రమేష్ అన్నారు. శుక్రవారం కోర్టు ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని పరిరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్‌జడ్జి యువరాజ్, జూనియర్ సివిల్‌జడ్జి అనంతలక్ష్మి, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్, న్యాయవాదులు టి సురేష్, ఎం సురేష్, చంద్రకుమార్, సతీష్, రాజీవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

వాంకిడి, ఆగస్టు 23: గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అరెస్టుచేసినట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. ఆయనతెలిపిన వివరాలప్రకారం.. పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో తిర్యాణి మండలం రొంపల్లికి చెందిన పెంద్రం శ్యాంరావు, మహారాష్ట్ర గడ్చంద్రూర్‌కు చెందిన బోయ భాస్కర్ అనుమానితంగా కనబడడంతో వారిని తనిఖీ చేయగా 620 గ్రాముల గంజాయి లభించిందన్నారు. వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

7క్వింటాళ్ల బెల్లం, 10క్వింటాళ్ల పటిక పట్టివేత

కౌటాల, ఆగస్టు 23: నాటుసారా తయారీ కోసం అక్రమంగా తరలిస్తున్న ఏడు క్వింటాళ్ల బెల్లం, 10 క్వింటాళ్ల పటికను శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై మధుకర్ తెలిపారు. ఆయనతెలిపిన వివరాల ప్రకారం.. వాహనాలతనిఖీల్లో భాగంగా ఆటో (ఏపీ1 డబ్ల్యూ 6176)ను తనిఖీచేయగా అందులో బెల్లం, పటిక పట్టుబడగా అందుకు సంబంధించిన పత్రాలు లేకపోవడంతో పట్టుకున్నట్లు సీజ్‌చేసినట్లు తెలిపారు. ఈమేరకు లాంబడీహెట్టి గ్రామానికి చెందిన జర్పుల శ్యాంపై కేసునమోదు చేసినట్లు తెలిపారు.

పశువులను తరలిస్తున్న ట్రాలీఆటో..

చింతలమానేపల్లి, ఆగస్టు 23: మండలంలోని డబ్బా గ్రామంవద్ద రెండు కోడెలు, ఒక ఆవు దూడను అక్రమంగా తరలిస్తున్న ట్రాలీ ఆటోను పట్టుకున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు ఆడెపల్లి నుంచి డబ్బా గ్రామం మీదుగా మహారాష్ట్రకు తరలిస్తుండగా డబ్బాఎక్స్‌రోడ్డు వద్ద పట్టుకున్నామన్నారు. ట్రాలీని సీజ్‌చేసి డ్రైవర్ కంబాల హరిప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుబడిన ఆవు, దూడలను కాగజ్‌నగర్ గోశాలకు తరలించినట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు..

రెబ్బెన, ఆగస్టు 23: మండలంలోని గంగాపూర్ వాగులో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను ట్రాక్టర్లలో తరలిస్తున్నట్లు సమాచారం మేరకు దాడులు చేసి పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

'మాస్టర్‌ప్లాన్' అమలయ్యేదెప్పుడు?



కాగజ్‌నగర్ మార్కెట్ ఏరియా

- ఇరుకు రోడ్లతో నిత్యం సమస్యలే
- పెరుగుతున్న రద్దీ
- పట్టణవాసులకు తప్పని ఇబ్బందులు

కాగజ్‌నగర్, ఆగస్టు 23: కాగజ్‌నగర్ మున్సిపాల్టీ జిల్లాలోనే అతిపెద్దదిగా పేరొందినప్పటికీ మాస్టర్ ప్లాన్ అమలు కాక అన్నీ సమస్యలు తలెత్తుతున్నాయి. 30 వార్డులకు అనుసంధానంగా ఉన్న అంతర్గత రోడ్లు, ప్రధానరోడ్లు ఇరుకుగా ఉండటంతో చిన్నపాటి వాహనాలు కూడా పోలేని పరిస్థితి నెలకొంది. 2018లో అప్పటి ప్రభుత్వం అన్ని మున్సిపాల్టీలో మాస్టర్‌ప్లాన్ అమలు చేసేందుకు ఆదేశాలను జారీచేసింది. ఈ ఆదేశాల మేరకు కూడా కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో ఢిల్లీ ప్రతినిధుల బృందం మూడు నెలల పాటు మున్సిపాలిటీలో సర్వే చేసింది. 2040 సంవత్సరం వరకు ఏర్పడే పరిస్థితులు, జనాభా దృష్ట్యా తీసుకోవాల్సిన అంశాలపై నివేదికలను రూపొందించారు. ఇందుకోసం పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తా నుంచి మార్కెట్ ఏరియా వరకు రోడ్డు వెడల్పు చేయటం, అలాగే పట్టణంలో అంతర్గతరోడ్లు కూడా వెడల్పుకు చేయాలని సూచించారు. వీటితో పాటు మరో రెండు వాటర్ తాగునీటి ట్యాంకుల నిర్మాణం కూడా చేయాలని సూచించారు. అలాగే పట్టణానికి సమీపంలో ఉన్న గ్రామాలైన చింతగూడ, కోసిని, రాంనగర్, బోరిగాంతో పాటు తదితర గ్రామాలకు అనుసంధానంగా ఉండేందుకు విలీన కార్యక్రమాలను కూడా చేపట్టాలని సూచించారు. ఇందుకోసం ప్రత్యేక మ్యాప్ కూడా రూపొందించారు. వీటితోపాటు శాటిలైట్‌మ్యాప్ రూపొందించారు. ఈ ప్రక్రియ పూర్తిచేసి రెండేళ్లు జరిగింది. ఇంతవరకు అతీగతిలేని పరిస్థితి దాపురించింది. మాస్టర్‌ప్లాన్ అమలు చేయక పోవటంతో నిత్యం ప్రజలు అవస్థలు పడుతున్నారు. పండుగల సమయంలో మార్కెట్ ఏరియాలోని అంబేద్కర్‌చౌక్, పొట్టిశ్రీరాములు చౌక్‌లో నడవలేని పరిస్థితి ఏర్పడుతోంది. రద్దీగా బాగా ఉంటోంది. మార్కెట్ ఏరియాలో వివిధ వాణిజ్య సముదాయాలకు సంబంధించిన మెటీరియల్ హైదరాబాద్, ఢిల్లీ, ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వివిధ వస్తువులను లారీల ద్వారా ఇక్కడికి తెస్తుంటారు. ఒక్క లారీ వచ్చిందంటే చాలా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ట్రాఫిక్ సమస్య ఏర్పడినపుడు ద్విచక్రవాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతోంది. అలాగే లారీ చౌరస్తాలో కూడా కూడలి విస్తరణ కాకపోవటంతో లోడ్ వాహనాలు పట్టణంలోకి రావాలంటే ఇబ్బందికరమైన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ మార్గంలో రోడ్డుకిరువులా చిరువ్యాపారాలు ఉండటంతో కూడా ట్రాఫిక్ సమస్యకు కారణంగా తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మాస్టర్ ప్లాన్ అమలు జరిగేలా చూడాలని పట్టణవాసులు కోరుతున్నారు.

మాస్టర్‌ప్లాన్ అమలు చేసేందుకు చర్యలు..

అంజయ్య, కమిషనర్, కాగజ్‌నగర్



మాస్టర్‌ప్లాన్ అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గతంలో ఢిల్లీకి చెందిన బృందం పట్టణంలో మాస్టర్ ప్లాన్ అమలుకు సర్వేలు చేసింది. నివేదికలను కూడా ఇచ్చింది. ఈ నివేదికలను ఉన్నతాధికారులకు కూడా పంపించాం. వారి నుంచి ఆదేశాలు రాగానే మాస్టర్ ప్లాన్ అమలు చేస్తాం.

మహిళా శక్తి పథకంతో ఆర్థికాభివృద్ధి: కలెక్టర్



కాగజ్‌నగర్‌లో బల్క్‌మిల్క్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

కాగజ్‌నగర్, ఆగస్టు 23: మహిళా శక్తి పథకం మహిళలు ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుందని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్ పట్టణంలో జిల్లా గ్రామీణ అభివృద్ధిశాఖ, మండలసమాఖ్య కార్యాలయం ఆధ్వర్యంలో మహిళా సంఘాలతో ఏర్పాటు చేయనున్న బల్క్‌మిల్క్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా శక్తి పథకంలో మీసేవా కేంద్రాలు, పౌల్ట్రీ, క్యాంటీన్లు తదితర అనేక అంశాలు పొందుపరిచినట్లు వివరించారు. ఈ అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ దీపక్ తివారి, మున్సిపల్ కమిషనర్ అంజయ్య తహసీల్దార్ కిరణ్‌కుమార్ తదితరులున్నారు.

నూతన ఆర్‌వోఆర్ చట్టంపై సూచనలివ్వాలి..

ఆసిఫాబాద్, ఆగస్టు 23: ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఆర్‌ఓఆర్ చట్టం ముసాయిదాపై సూచనలు, సలహాలు అందజేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి నూతన ఆర్‌వోఆర్ చట్టం ముసాయిదాపై విశ్రాంత రెవెన్యూ అధికారులు, విద్యావేత్తలు, న్యాయవాదులు, నిపుణులతో చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్‌వోఆర్ ముసాయిదా బిల్లుపై నిపుణులు అందించిన ప్రతిసలహాను సీసీఎల్ఏకు నివేదిస్తామని తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న భూసమస్యల పరిష్కారానికి నూతన చట్టాన్ని రూపొందించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. నూతన చట్టం రూపకల్పనలో ప్రజలను భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆదేశాలమేరకు చర్చ కార్యక్రమం నిర్వహించామన్నారు. రైతుసంఘాలు, మేధావులు, విద్యావేత్తలు, న్యాయవాదాలు, ప్రజాప్రతినిధులు, విశ్రాంత ఉద్యోగులు తమసలహాలు, సూచనలను రాతపూర్వకంగా కలెక్టరేట్‌లో అందించితే వాటిని ఒక నివేదిక రూపంలో తయారుచేసి సీసీఎల్‌కు అందిస్తామన్నారు. కార్యక్రమంలో విశ్రాంత తహసీల్దార్, రెవెన్యూ అధికారులు, న్యాయవాదులు, రైతుసంఘాల నాయకులు, ఆదివాసీసంఘాల నాయకులు, రైతులు, నిపుణులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

పూలాజీబాబా జయంతిని ఘనంగా నిర్వహించాలి..

ఈనెల29,30తేదీల్లో పూలాజీ బాబా జయంతిని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పూలాజీబాబా జయంతి ఉత్సవాల నిర్వహణపై ఏర్పాటుచేసిన సన్నాహక సమావేశానికి ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఏఎస్పీ ప్రభాకర్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, పూలాజీబాబా ట్రస్ట్ అధ్యక్షుడు కేశవరావుతో కలిసి హాజరయ్యారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పూలాజీబాబా జయంతిని జైనూరు మండలం పాట్నాపూర్‌లోగల పూలాజీబాబా సంస్థానంలో ఈనెల29,30తేదీల్లో ఘనంగా నిర్వహిస్తామన్నారు. అధికారులు, ట్రస్ట్‌ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఆసిఫాబాద్, వాంకిడి, రెబ్బెన, కెరమెరి, జైనూరు మండలాల నుంచి భక్తుల సౌకర్యార్థం బస్సులు ఏర్పాటుచేయాలని, వైద్యసేవల నిమిత్తం ప్రత్యేకశిబిరాలు, విద్యుత్, పారిశుధ్యం, సంచారమూత్రశాలసౌచాలయాల వాహనాల ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పార్కింగ్, పోలీసుబందోబస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. పారిశుధ్య పనుల నిర్వహణకు అధిక సంఖ్యలో కార్మికులను నియమించాలని, పారిశుధ్య పనులను పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాం పాల్గొన్నారు.

రుణమాఫీ అందరికీ అందజేయాలి

రెబ్బెన, ఆగస్టు 23: ప్రభుత్వం అందిస్తున్న రుణ మాఫీ అందరికీ వర్తింపజేయాలని బీజేపీ జిల్లా అధికారప్రతినిధి కేసరి అంజనేయులుగౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో రెబ్బెనలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎలాంటి షరతులు లేకుండా అందరికీ రుణమాఫీ చేయాలన్నారు. రూ.2లక్షల రుణమాఫీ విషయంలో ఇంతవరకు స్పష్టత లేదన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీకన్వీనర్ సొల్లు లక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షుడు గుల్బం చక్రపాణి, జిల్లా కార్యదర్శి కుందారపు బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌ను సందర్శించిన సీఐ

పెంచికలపేట, ఆగస్టు 23: మండలకేంద్రంలోని పోలీసుస్టేషన్‌ను శుక్రవారం రూరల్‌సీఐ శ్రీనివాసరావు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. పోలీసుస్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అలాగే మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని అన్నారు. వినాయకనిమజ్జనం సందర్భంగా తీసుకోవాల్సిన విధివిధానాలను సిబ్బందికి వివరించారు. ఆయన వెంట ఎస్సై కొమురయ్య, పోలీసుసిబ్బంది ఉన్నారు.

ఎస్పీఎంలో ఎన్నికలు నిర్వహించాలి



ఫిర్యాదు చేస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

కాగజ్‌నగర్, ఆగస్టు 23: ఎస్పీఎంలో వెంటనే ఎన్నికలు నిర్వహించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హైదరాబాద్‌లో కార్మికశాఖజాయింట్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జేకే యాజమాన్యం కార్మికుల హక్కులను కాలరాస్తోందన్నారు. అదేవిధంగా ఎస్‌సీఎల్‌టీ నుంచి వచ్చిన కార్మికనిధులను దుర్వినియోగం జరిగాయన్నారు. ఈవిషయంపై కూడా సమగ్ర విచారణ జరపాలని జాయింట్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లెండుగురే శ్యాంరావు, అంబాల ఓదెలు, నక్క మనోహర్, కాగజ్‌నగర్ పేపర్‌యూనియన్ నాయకులు ఈర్ల సతీష్, రహీం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అతిథి అధ్యాపకులు

ఆసిఫాబాద్, ఆగస్టు 23: ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్‌చేస్తూ ప్రభుత్వజూనియర్ కళాశాలలో పనిచేస్తున్న అతిథిఅధ్యాపకులు కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. అంతకుముందు కుమరంభీం చౌక్ నుంచి కలెక్టరేట్‌వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథి అధ్యాపక సంఘం జిల్లా అధ్యక్షుడు మారుతి మాట్లాడుతూ 2012నుంచి ప్రభుత్వకళాశాలల్లో అతిథి అధ్యాపకులుగా పనిచేస్తున్నప్పటికీ ఉద్యోగభద్రతలేక ఆందోళన చెందుతున్నామన్నారు. ప్రతిసంవత్సరం రెన్యూవల్ ఉత్తర్వుల కోసం ఎదురుచూడాల్సి వస్తోందన్నారు. సంవత్సరంలో ఎనిమిదినెలలు మాత్రమే వేతనం తీసుకుంటూ అకడమిక్ సంవత్సరం మొత్తం పనిచేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో లోకేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అతిథి అధ్యాపకులు కృష్ణమూర్తి, రాము, యాదగిరి, భిక్షపతి, రాంబాబు, శ్రీకాంత్, స్వాతి, అశ్విని, మౌనిక, సునీత, ఉదయశ్రీ పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



మాట్లాడుతున్న విజయలక్ష్మి

ఆసిఫాబాద్ రూరల్, ఆగస్టు 23: సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో జిల్లాలోని 15మండలాల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గతంలో టీపీసీసీఅధ్యక్షుడు, ప్రస్తుతం సీఎంరేవంత్‌రెడ్డి వరంగల్‌లో విద్యాశాఖసమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మెకు మద్దతుగా మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లను అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీఇంతవరకు అమలు కాలేదన్నారు. గడిచిన9 నెలల్లో రాష్ట్రంలో ఆరుగురు ఉద్యోగులు చనిపోయినా ఎలాంటి ఎక్స్‌గ్రేషియా, దహనఖర్చులు కూడా ఇవ్వలేదన్నారు. తమసమస్యల పరిష్కారం కోసం ఈనెల 28న కలెక్టరేట్ ఎదుట ఒక్కరోజు ధర్నా చేపట్టబోతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆసంఘంనాయకులు తుకారాం,నగేష్,పవన్,సంతోష్, సందీప్, వెంకటరమణ, మహేష్, దేవేందర్, సత్యనారాయణ, రమేష్,రాజేష్, రాజ్‌కుమార్, తిరుపతి, ఆనంద్, శృతిక, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ కోర్సుల పోస్టర్ల ఆవిష్కరణ

ఆసిఫాబాద్ రూరల్, ఆగస్టు 23: స్థానిక జిల్లాపరిషత్ బాలికల పాఠశాలలో తెలంగాణ సార్వత్రిక విద్యా పీఠం(ఓపెన్)లో పదవతరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశానికి సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఉమ్మడిజిల్లా కోఆర్డినేటర్ అశోక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యక్తిగతకారణాలు, ఇతర కారణాలతో చదువు పూర్తి చేయలేకపోయిన వారు ఓపెన్‌విధానం ద్వారా పది, ఇంటర్మీ డియట్ చదవవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుభాష్‌బాబు, పాల్గొన్నారు.

తెల్ల రేషన్‌కార్డు లేని వారికి కాని రుణమాఫీ

సిర్పూర్(టి), ఆగస్టు 23: తెల్లరేషన్‌కార్డు లేనివారికే రుణమాఫీ కాలేదని మండలంలో అమలైన రైతురుణమాఫీ తీరును పరిశీలించిన రైతులు పేర్కొంటున్నారు. మండలంలోని 16గ్రామ పంచాయతీల పరిధిలో తెల్లరేషన్ కార్డు లేక, కుటుంబం నుంచి వేరేఉన్న వారికి కార్డు లేకపోవడంతో రుణమాఫీ వర్తించలేదు. దీంతో వారు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. ఈవిషయమై వ్యవసాయాధికారి మధులతను వివరణ కోరగా తెల్లరేషన్ కార్డులేని వారికి రుణమాఫీ కాని విషయం వాస్తవమేనని అన్నారు. వారినుంచి అర్జీలను స్వీకరిస్తున్నామని, నివేదికలను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

'సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి'

జైనూర్, ఆగస్టు 23: ఐకేపీలో విధులు నిర్వర్తిస్తున్న వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని వీవోఏల సంఘం జిల్లా కార్యదర్శి జ్యోతి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం మాట్లాడుతూ వీవోఏలకు రూ.10 లక్షల ఇన్సూరెన్స్, ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయం కల్పించాలని కోరారు.



'ఏఐటీయూసీ చేస్తున్నవి తప్పుడు ఆరోపణలు'

శ్రీరాంపూర్, ఆగస్టు 23: హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శిపై ఏఐటీయూసీ నాయకులు చేస్తున్నవి తప్పుడు ఆరోపణలని హెచ్ఎంఎస్ యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి వి అనిల్‌రెడ్డి అన్నారు. వారం క్రితం గోదావరిఖనిలో స్వప్న అనే దళిత మహిళా కార్మికురాలిపై ఏఐటీయూసీ నాయకులు దాడిచేసింది నిజంకాదా అని ఆయన ప్రశ్నించారు. బాధితురాలికి మద్దతుగా అన్ని సంఘాలు బాసటగా నిలిచాయని, రియాజ్ అహ్మద్ స్పందించి న్యాయం అడగడం తప్పా అని అన్నారు. తమ తప్పును కప్పి పుచ్చుకోవడానికి ఎదురుదాడి చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా దాడిచేసిన నాయకున్ని ఏఐటీయూసీ యూనియన్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

జీఎంను కలిసిన ఐఎన్టీయూసీ నాయకులు

మందమర్రి టౌన్, ఆగస్టు 23: మందమర్రి ఏరియా జీఎంగా బాధ్యతలు స్వీకరించిన దేవేందర్‌ను ఐఎన్టీయూసీనాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏరియాలోని గనుల, డిపార్టుమెంట్ల వారీగా పలు సమస్యలను వివరించారు. అనంతరం ఆయనను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, పీఎం శ్యాంసుందర్, కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య పాల్గొన్నారు.

సీహెచ్‌పీని సందర్శించిన జీఎం

రెబ్బెన, ఆగస్టు 23: గోలేటి సీహెచ్‌పీని బెల్లంపల్లి ఏరియా సింగరేణి జీఎం ఎం శ్రీనివాస్ శుక్రవారం సందర్శించారు. రవాణా, పరిసరాల్లో నీటిని చల్లే విధానాన్ని, ఆన్‌లైన్ మానిటరింగ్‌ను చూసి సిబ్బందిని అభినందించారు. ఉత్తమ సీహెచ్‌పీగా అవార్డు అందుకున్న సిబ్బందిని, ఉద్యోగులను అభినందించారు. జీఎం తొలిసారిగా వచ్చిన సందర్భంగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇంజనీర్‌భీంరావు జాడే, సీహెచ్‌పీ హెచ్‌ఓడీ కోటయ్య, ఈఈ రాజు పాల్గొన్నారు.

కార్పొరేట్ జీఎంకు ఘన సన్మానం



అధికారిని సన్మానిస్తున్న జీఎం, తదితరులు

శ్రీరాంపూర్, ఆగస్టు 23: కార్పొరేట్ జీఎం(సీఎంసీ)గా పనిచేసి ఈనెలలో రిటైర్ కానున్న జి మోహన్‌రెడ్డిని శ్రీరాంపూర్ ఇన్‌చార్జి జీఎం టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆయన సింగరేణి సంస్థలో 41ఏళ్ల తన సర్వీసు పూర్తి చేసుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో జీఎం(రక్షణ) రఘుకుమార్, ఎస్‌వోటు జీఎం ఎస్ సత్యనారాయణ, అధికారులసంఘం ఏరియా అధ్యక్షుడు కె వెంకటేశ్వర్ రెడ్డి, ఇందారం ఓసీపీ పీవో ఏవీరెడ్డి, ఏజెంట్లు పాల్గొన్నారు.

ఎస్ఆర్పీ3 గనిపై: ఎస్ఆర్పీ3 గనిలో పనిచేసి ఆర్‌జీ-3 ఏరియాకు బదిలీపై వెళ్తున్న రక్షణాధికారి శ్రీధర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మేనేజర్ వెంకటరావు, పిట్‌కార్యదర్శి అంబాల రవి, సంక్షేమాధికారి గౌస్‌పాషా,తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: సింగరేణి అభివృద్ధికి జీఎం (సీఎంఎస్)మోహన్‌రెడ్డి చేసిన సేవలు ప్రశంసనీయమని మందమర్రి ఏరియా ఇన్‌చార్జి జీఎం రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం జీఎం కార్యాయలంలో ఈనెల 31న పదవీ విరమణ పొందుతున్న ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధికారులు రహీం దర్, వెంకటరమణ, రామదాసు, గోవిందరావు, శ్యాంసుందర్, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

'నాసిరకమైన బూట్లు పంపిణీ చేసిన యాజమాన్యం'

శ్రీరాంపూర్, ఆగస్టు 23: సింగరేణి యాజమాన్యం నాసిరకమైన బూట్లు పంపిణీ చేసిందని ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా ఆరోపించారు. శుక్రవారం ఆయన ఎస్ఆర్పీ1 గనిని సందర్శించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. నాసిరకమైన బూట్లు రెండు నెలలకే చిరిగిపోతున్నాయని కార్మికులు తెలిపారు. పాత రూఫ్‌బోల్ట్ మిషన్లు ఉన్నాయని పేర్కొన్నారు. కార్మికులకు నాణ్యమైన పనిముట్లు అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బ్రాంచ్ సహాయకార్యదర్శి మోత్కూరి కొమురయ్య, పిట్‌కార్యదర్శి దాడి రాజయ్య, నాయకులు అఫ్రోజ్‌ఖాన్, కామెర వేణు, పరశురాములు, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ వర్కర్స్ ఆధ్వర్యంలో: సింగరేణి కాంట్రాక్ట్‌వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో టింబర్‌యార్డు, ఏరియా స్టోర్స్‌లో గేట్‌మీటింగ్ ఏర్పాటుచేయగా, రీజియన్‌కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, బ్రాంచ్‌అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్ హాజరై మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటా చెల్లించాలని కోరారు.కార్యక్రమంలో బ్రాంచ్‌కార్యదర్శి బూర వీరేశం, ప్రభాకర్, సురేంద్రచారి, రాజు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులకు రుణమాఫీ వస్తుంది: ఏడీఏ

దహెగాం, ఆగస్టు 23: అర్హులైన ప్రతిరైతుకు రుణమాఫీ వస్తుందని రైతులు ఆందోళన చెందవద్దని ఏడీఏ మనోహర్ అన్నారు. శుక్రవారం మండలంలోని కుంచవెల్లి రైతువేదికలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ సాంకేతిక లోపాలతో రుణమాఫీ డబ్బులు రైతుల ఖాతాల్లో జమకాలేదన్నారు. రైతుల పేర్లు, ఆధార్, కుటుంబ సభ్యుల వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలు దరఖాస్తు రూపంలో ఏఈఓలకు అందజేసి సరి చేసుకోవాలన్నారు. సమావేశంలో టీజీబీమేనేజర్ ప్రవీణ్‌కుమార్, ఏఈఓలు ఆనంద్‌రావు, దీపక్, తదితరులు పాల్గొన్నారు.

ఆదరణ ఉన్నా.. సౌకర్యాలు సున్నా..

- గంగాపూర్ వెంకన్న దర్శనానికి వంతెన కష్టాలు
- వాగుపై కొట్టుకుపోయిన స్లాబ్ కల్వర్టు
- ఇబ్బందులు పడుతున్న భక్తులు



వాగు నీటిలో నడుచుకుంటూ వెళుతున్న భక్తులు

రెబ్బెన, ఆగస్టు 23: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ఆలయాలలో రెబ్బెన మండలం గంగాపూర్ ఆలయం ఒకటి. ఈ ఆలయంలో కొలువైన శ్రీ బాలాజీ వెంకటేశ్వరస్వామి దర్శనాన్ని చేసుకోవాలంటే పడరాని పాట్లు పడాల్సిందే. ఈఆలయం సమీపంలో వాగు ఉంటుంది. వాగుపై తాత్కాలికంగా నిర్మించిన స్లాబ్‌కల్వర్టు కొట్టుకపోవటంతో ప్రస్తుతం భక్తులు వాగులోంచి దర్శనానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు కానీ నాయకులు కానీఇంతవరకు సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం శ్రావణ మాసం కావటంతో భక్తులు స్వామి వారిని దర్శించేందుకు పెద్దసంఖ్యలో వస్తున్నారు. జిల్లా నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు ఇక్కడికి వస్తుంటారు. కార్లు, ద్విచక్ర వాహనాలతో వచ్చిన భక్తులు వాగు ఒడ్డున వాటిని నిలిపి నడుచుకుంటూ వచ్చి స్వామి వారిని దర్శించుకుంటున్నారు. కొన్నిసందర్భాల్లో వృద్ధులు, మహిళలు వాగులోని రాళ్లపై నుంచి జారిపడి గాయాలైన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాగుపై వంతెన నిర్మించాలని భక్తులు కోరుతున్నారు. కనీసం వచ్చే జాతర నాటికైనా వంతెన నిర్మించాలని లేకపోతే చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందని భక్తులు పేర్కొంటున్నారు.

వాగుపై వంతెన నిర్మించాలి..

-కిరణ్ కుమార్, రెబ్బెన



స్వామి వారి ఆలయానికి భక్తులు అధికసంఖ్యలో వస్తుంటారు. వాగుపై బ్రిడ్జి నిర్మించాలి. కనీసంవచ్చే జాతర వరకైనా వంతెన నిర్మిస్తే బాగుంటుంది. ఆదిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి.